రేపట్నుంచి దేవీనవరాత్రి ఉత్సవాలు



కీసరగుట్ట దేవస్థానంలో కొలువైన శ్రీ భవానీ, శివదుర్గా అమ్మవారు

కీసర: ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. 9 రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు వారు తెలిపారు. 3న గురువారం అమ్మవారిని శ్రీ బాలత్రిపుర సుందరీదేవిగా, 4న శ్రీ స్వర్ణకవచ శివ దుర్గాదేవి, 5న శ్రీ గాయత్రీదేవి, 6న శ్రీ అన్నపూర్ణదేవి, 7న శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి, 8న శ్రీ మహాలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న శ్రీదుర్గాదేవి, 11న శ్రీ మహిషాసురమర్ధిని, 12న శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభం

డీఈఓ విజయకుమారి

సాక్షి, సిటీబ్యూరో: డీఎస్సీ- 2024 పాఠశాల విద్యాశాఖ సంచాలకుల ఉత్తర్వుల ప్రకారం సబ్జెక్టుల వారీగా తెలంగాణ అభ్యర్థుల మెరిట్ ఆధారంగా 1:3 ప్రకారం లిస్టును ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు డీఈఓ విజయకుమారి తెలిపారు. లిస్ట్ ప్రకారం అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ప్రారంభమైందని, ఈ నెల 5 వరకు ప్రతీరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మల్కాజిగిరి జిల్లా పరిషత్ స్కూల్(బాలుర) నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ఉన్న ప్రొఫార్మాలో వారి వివరాలు పొందుపరచి, రెండు జతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు గెజిటెడ్ అధికారి సంతకాలతో సమర్పించాలన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్న తర్వాత జిరాక్స్ ప్రతులు సమర్పించాలని ఆమె సూచించారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాడుదాం



టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు బాలరాజుకు ఇళ్లపట్టాల దరఖాస్తులను అందిస్తున్న భూపాల్

శామీర్‌పేట్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదామని మేడ్చల్ జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు అన్నారు. మంగళవారం ఉమ్మడి శామీర్‌పేట మండల ప్రింట్ మీడియా ప్రతినిధుల సమావేశం మండల అధ్యక్షుడు రాజిగళ్ల భూపాల్ ఆధ్వర్యంలో శామీర్‌పేటలోని ఓ రిసార్ట్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరిగే ప్రతీ విషయాన్ని ప్రజలకు చేరవేయడంలో పత్రికారంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అనంతరం భూపాల్ జర్నలిస్టుల ఇళ్లపట్టాల దరఖాస్తులను ఆయనకు అందజేశారు.

3 నుంచి డ్రైవర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి లోని ఈఎంఆర్‌ఐ కేంద్రంలో 108, 102, 1962 వాహనాల్లో పైలట్(డ్రైవర్ల)కు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సంస్థ జిల్లా మేనేజర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు. 23 నుండి 30 ఏళ్ల లోపు వయస్సు ఉండి, పదవ తరగతి ఉత్తీర్ణులై ఎల్ఎంవీ బ్యాడ్జ్ లైసెన్సులు కలిగిన వారు ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఈ నెల మూడో తేదీ నుంచి 5వ తేదీ వరకు నగరంలోని కోఠి జిల్లా ఆసుపత్రిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు తమ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

బాధ్యతల స్వీకారం



నాగమణికి అభినందనలు తెలుపుతున్న చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఎం.నాగమణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగమణికి నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్' నమోదులో మార్పు

ఎస్సీ అభివృద్ధి జిల్లా అధికారి వినోద్ కుమార్

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అర్హులైన ఎస్సీ విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల నమోదుకు సంబంధించి నూతన విధివిధానాలు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ-పాస్ వెబ్‌సైట్లో మార్పు చేశారని, దీని ప్రకారం అర్హులైన ప్రతీ విద్యార్థి పేరు ఎస్ఎస్‌సీ మెమో మాదిరిగానే ఆధార్‌లో కూడా ఉండాలని ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జి.వినోద్ కుమార్ తెలిపారు. విద్యార్థి ఆదాయ పరిమితి రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల పెంచినట్లు తెలిపారు. ఈ-పాస్‌లో నమోదు కోసం విద్యార్థి ఇంటర్నెట్ సెంటర్‌లో ఎస్ఎస్‌సీ వివరాలు, ఆధార్ కార్డ్ వివరాలతో సరిపోలిన తర్వాతే తాత్కాలిక 12 అంకెల ఈ-పాస్ ఐడీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఒక వేళ విద్యార్థి ఎస్ఎస్‌సీ మెమోలో పొందు పరిచిన వివరాలు, ఆధార్ వివరాలతో సరిపడని యెడల దగ్గరిలోని మీసేవా కేంద్రంలో ఆధార్ వివరాలు సరిచేసుకోవాలని సూచించారు. తర్వాత ఇంటర్నెట్ సెంటర్‌లో పూర్తిస్థాయి నమోదు ప్రక్రియ పూర్తి చేసి, సంబంధిత ధ్రువపత్రాలు జతపరచి, సంబంధిత కళాశాలలో సమర్పించాలన్నారు. ఈ మార్పునకు సంబంధించిన విషయాలను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాల ప్రధానాచార్యులు ఈ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వినోద్ కుమార్ సూచించారు.

రోగులకు టెలీమెడిసిన్

• పేదలకు ప్రత్యేక వైద్యసేవలు • ప్రయోజనం పొందుతున్న రోగులు

- మల్కాజిగిరి ఆసుపత్రితో సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల అనుసంధానం
- ఉస్మానియా, గాంధీ, నిమ్స్ నుంచి కూడా రోగులకు సేవలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ వైద్యరంగంలో ప్రవేశపెట్టిన టెలీ మెడిసిన్ విధానంతో ప్రత్యేక వైద్యసేవలు బస్తీ, పల్లెవాసుల దరి చేరాయి. వైద్యులు టీవీ, కంప్యూటర్ విధానంలో రోగులను పరిశీలించి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వచ్చే అల్పాదాయ వర్గాలకు ఇది వరం. మల్కాజిగిరిలోని జిల్లా ఆసుపత్రితో రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 12 సీహెచ్‌సీలు, 24 యూపీహెచ్‌సీలు అనుసంధానం చేశారు. వీటి పరిధిలో ఇప్పటివరకు 26,436 మంది టెలీ మెడిసిన్ సేవలు పొందారు. జిల్లా వ్యాప్తంగా 24 యూపీహెచ్‌ఎస్, 4 పీహెచ్‌సీలు, ఒక ఏరియా ఆసుపత్రి, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అనుసంధానం చేశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా, నిమ్స్, గాంధీ ప్రభుత్వ ఆసుపత్రులకు మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని అనుసంధానం చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన 40 ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల నుంచి కూడా రోగులు ఇక్కడి సేవలు పొందేలా ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో టెలీ మెడిసిన్ సేవలు నిరంతరం కొనసాగుతున్నాయని జిల్లా వైద్యారోగ్య శాఖ డాక్టర్ రఘునాథ్‌స్వామి పేర్కొంటున్నారు.

సమన్వయంతో సేవలు

అనారోగ్య సమస్యలతో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలను సంప్రదిస్తున్న బాధిత రోగులను అక్కడి వైద్యులు పరీక్షిస్తున్నారు. వారికి నిపుణుల సేవలు అవసరమైతే వెంటనే మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రి టెలీ మెడిసిన్ వైద్యులను సంప్రదిస్తున్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రోగులకు వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారు. ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి పేర్లు నమోదు చేస్తూ మధ్యాహ్నం 2 గంటల వరకు సేవలందిస్తున్నారు. ప్రధాన ఆస్పత్రి నుంచి నేరుగా ప్రత్యేక వైద్యనిపుణులు టీవీ, కంప్యూటర్ ద్వారా పీహెచ్‌సీలకు అనుసంధానం చేసిన ట్యాబ్, టీవీ, కంప్యూటర్లో రోగితో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారు. తర్వాత స్థానిక వైద్యాధికారికి సలహాలు, సూచనలు అందిస్తూ చికిత్సలు అందిస్తున్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని రిఫర్ చేయాలని సూచిస్తున్నారు. ఇలా ప్రాణాంతక రోగాలను ప్రాథమిక దశలో నియంత్రిస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో టెలిమెడిసిన్ సేవలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఘట్కేసర్, మేడ్చల్ కమ్యూనిటీహెల్త్ సెంటర్లు, మూడు చింతలపల్లి, శామీర్‌పేట, కీసర, జవహర్‌నగర్, కుషాయిగూడ, శ్రీరంగ వరం, నారపల్లి, ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, బాలానగర్, అల్వాల్ వీహెచ్‌సీలతోపాటు మచ్చబొల్లారం, సుభాష్‌నగర్, పర్వతానగర్, మూసాపేట్, జగద్గిరిగుట్ట, ఎల్లమ్మబండ హంసపేట్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్, గాజులరామారం సూరారం కాలనీ, వినాయకనగర్, ఏకలవ్య నగర్, మౌలాలీ, సఫిల్‌గూడ, మల్లాపూర్, వెంకట్‌రెడ్డి నగర్, నాగోల్, కొత్తపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ, చర్లపల్లి, పేట్‌బషీరాబాద్ యూహెచ్‌సీలకు చెందిన రోగులు మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రి సమన్వయంతో ప్రత్యేకసేవలను వినియోగించుకుంటున్నారు.



జిల్లాలో లేని సేవలకు హైదరాబాద్ నుంచి....

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అవకాశం లేని ఎండోక్రైనాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, సైక్రియాటిక్ నెఫ్రాలజీ, అంకాలజీ, పల్మనాలజీ, సైకోథెరపీ విభాగాల నిపుణులు హైదరాబాద్‌లోని ఉస్మానియా, నిమ్స్, గాంధీ ఆస్పత్రుల నుంచి టెలీ మెడిసిన్ సేవలను అందిస్తున్నారు.

వైద్య నిపుణులతో రోజువారీ సేవలు

టెలీ మెడిసిన్ సేవలందించే వైద్యనిపుణులు వారంలో ఒకరోజు అందుబాటులో ఉండేలా షెడ్యూల్ రూపొందించారు.

సోమవారం	- డెర్మటాలజీ, గైనకాలజీ
మంగళవారం	- ఆప్తమాలజీ, ఈఎన్‌టీ
బుధవారం	- జనరల్, మెడిసిన్
గురువారం	- పీడియాట్రిక్, జనరల్ సర్జన్,గైనకాలజీ
శుక్రవారం	- గైనకాలజీ
శనివారం	- ఆర్థోపెడిక్

నేడు రక్తదాన శిబిరాలు

శామీర్‌పేట్: గాంధీ జయంతి సందర్భంగా నేడు(బుధవారం) రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నారు. లైఫ్ సేవర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయంజాల్‌లో, మూడు చింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నామని నిర్వాహకులు బీటెక్ సాయి తెలిపారు. యువత పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భూమి కబ్జాపై ఫిర్యాదు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్‌లో గల విలువైన గ్రామకంఠం భూమిని కొంతమంది కబ్జా చేసి అక్రమ నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారని గ్రామ కోనేరుగా ఉపయోగపడుతోందని, దానిని కాపాడాలని గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని దుర్గామాత ఆలయ సమీపంలో హరింత బండ పేరుతో గ్రామ కోనేరు ఉందని దానిని అక్రమార్కులు కబ్జాలు చేసి అన్యాక్రాంతం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వివాదాస్పద స్థలంలో సర్వే

పోచారం: నారపల్లిలోని సర్వే నెంబర్ 27లో వివాదాస్పద స్థలంలో లోకాయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సర్వే నిర్వహించారు. సర్వే నెంబర్ 27లో తనకు చెందిన 79, 86 ప్లాట్లలోకి రానివ్వకుండా కొందరు వ్యక్తులు అడ్డుకుంటున్నారని లోకాయుక్తలో మల్లేష్ ఫిర్యాదు చేశారు. లోకాయుక్త విచారణాధికారి మాథ్యూ కోశీ ఆధ్వర్యంలో శాటిలైట్ సర్వే నిర్వహించారు. డాక్యుమెంట్లను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



తూంకుంటలో 2 కే రన్



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

శామీర్‌పేట్: స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా తూంకుంట మున్సిపాలిటీలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులతో 2 కే రన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛదనంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ మాట్లాడుతూ ప్రజలందరూ స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం తగ్గించి, మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, డిప్యూటీ ఈఈ సునీత, ఆర్‌ఐ భాస్కర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రేణుక పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల ప్రారంభం



డ్రైనేజీ పనులు పర్యవేక్షిస్తున్న పావనీజంగయ్య, నరేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 15వ వార్డులో రూ.8 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, స్థానిక కౌన్సిలర్ నరేశ్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత కాలం నాటి తక్కువ కెపాసిటీ గల డ్రైనేజీ పైపులైన్‌తో తరచూ మ్యాన్‌హోళ్లు నిండి బయటకు వచ్చి దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. దీంతో ప్రజల సమస్యను గుర్తించి కొత్త డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్యయాదవ్, చంద్రశేఖర్ గుప్త, రాము, అరవింద్‌గౌడ్, సన్నీ, స్థానికులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు



అవుషాపూర్ మెరిట్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో కళాశాల యాజమాన్యం

కీసర: మన పండుగల విశిష్టతలతోపాటు సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు అని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆటపాటలు

ఘట్‌కేసర్: పట్టణంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల, హోలీ ఫెయిత్ గ్రామర్ హైస్కూల్‌లో బతుకమ్మ సంబురాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గునుగు, బంతి, చామంతి రకరకాల ఇతర పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. విద్యార్థినులు, సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భానుమతి, జితేందర్‌రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అవుషాపూర్ మెరిట్ స్కూల్‌లో...

అవుషాపూర్ మెరిట్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రకరకాల పూలతో బతుమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు. కరస్పాండెంట్ అభినందన్‌రెడ్డి, హెచ్‌ఎం పుష్పలత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎంగిలిపూల కోలాహలం

మేడ్చల్: మేడ్చల్‌లో మంగళవారం బతుకమ్మ పండగ సంబరాలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా మహిళల కోలాహలంగా నెలకొంది. ఇళ్ల ముందు, కూడళ్లలో గంటల తరబడి ఆట పాటలతో గడిపి చెరువులు, కుంటలలో నిమజ్జనం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు ఆటపాటలతో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో...

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలు జరిగాయి. కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రటరి త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జానపద గాయని ఉషారాణి తన పాటలతో అలరించగా విద్యార్థులు ఉత్సాహంగా బతుకమ్మ చుట్టూ ఆడిపాడారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు, డీన్ వెంకట్రావు,శైలజరెడ్డి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.



అత్వెల్లి పాఠశాలలో ...



శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబురాలు



నాగారం ప్రభుత్వ పాఠశాలలో..



గుండ్లపోచంపల్లి పాఠశాలలో..

మేడ్చల్ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్

మేడ్చల్: మూసీ పునరావాస కేంద్రం కోసం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ ల్యాండ్ ప్రొటెక్షన్ సెక్షన్‌లో ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



రాంపల్లిలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ బతుకమ్మ ఉత్సవాలు

కీసర: రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బతుకమ్మ, దసరా సంబురాలు కనులపండువగా నిర్వహించారు. విద్యార్థులు నవదుర్గ అవతారాల ప్రాముఖ్యతను తెలియజేసేవిధంగా దేవతామూర్తుల రూపాలను అలంకరించుకొని ఆకట్టుకున్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.పద్మజ రావ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

14వ వార్డులో పార్క్ అభివృద్ధి



మొక్కలు నాటుతున్న చైర్ పర్సన్, కౌన్సిలర్లు

మేడ్చల్: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 14వ వార్డు పరిధిలో జాతీయ రహదారి పక్కన వాటర్ ట్యాంక్ వద్ద పూల మొక్కలతో పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి తెలిపారు. కౌన్సిలర్లు ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పూలమొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ ఆవరణలో గల ఖాళీస్థలంలో పూర్తిగా పూలమొక్కలు నాటి పూర్తిస్థాయి పూలమొక్కలతో ఉద్యానవనం అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి కాలనీల వాసులు, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



ఘట్‌కేసర్‌లో అవగాహన కల్పిస్తున్న అడ్మిన్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలోని బుగ్గబాయి కాలనీలో అడ్మిన్ ఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్ నివారణ, మత్తు పదార్థాల కట్టడిపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు పంపిన మెసేజ్‌లు, యాప్‌లు, లింకులు తెరవొద్దన్నారు. డ్రగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. అత్యావసర సమయంలో 100 డయల్ కాల్ చేయాలని, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అభినందన



జాతీయస్థాయికి ఎంపికైనవారిని అభినందిస్తున్న అపర్ణ, రాజశేఖర్

జవహర్‌నగర్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ క్రీడా పోటీల్లో జవహర్‌నగర్ కార్పొరేషన్‌కి చెందిన సీఆర్‌పీఎఫ్ పాఠశాల విద్యార్థులు పాల్గొని జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ పాఠశాల ప్రిన్సిపాల్ డి.అపర్ణ, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆదిత్య బిజూ, రెనిష్ రత్నానిలను అభినందించారు. ఈ నెల 6వ తేదీన వారణాసిలో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీల్లో సీఆర్‌పీఎఫ్ విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హరిశంకర్, ఆశాజీ కుమార్, రమణమూర్తి, వెంకటరావు, ఈశ్వర్‌రావు, కిషోర్, చంద్రశేఖర్, సత్యనారాయణ, భాస్కర్‌రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి



అంకుషాపూర్‌లోని గురుకుల్ మహిళా డిగ్రీ కళాశాలలో గాంధీ జయంతి వేడుకలు

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల్ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ పద్మమ్మ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం పరిశీలన



పోచారం: నారపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నూతనంగా కొర్రెములలో నిర్మించిన ఉపకేంద్రాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యాధికార బృందం మంగళవారం సందర్శించింది. ఉపకేంద్రంలోని సదుపాయాలతోపాటు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి, కీసర డివిజన్ ఉప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ మంజులారెడ్డి, వైద్యాధికారి డా.శోభన, బస్తీ దవాఖానా వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.